# రేపటి మహిళ

-కె. సూర్యకళారెడ్డి



డాక్టర్ విద్య మారుతికారు డ్రైవ్ చేస్తోందన్న మాటేకాని ఆమె మనస్సు మాత్రం పని మీద లగ్నం కాలేదు.

మనస్సు చేదుగా వికారంగా వుంది.

ఆదివారానికి కొంతయినా చల్లగాలి పీల్చుకొందుకు తన డ్యూటీని మరో డాక్టరుకి అప్పగించి లేడీస్ క్లబ్బుకొచ్చినామె వచ్చినంతసేపయినా నిలువకుండా తిరుగుముఖం పట్టింది.

మిసెస్ భాషా... మిసెస్ చార్లే... నాగరీకులు, బాగా చదువుకున్నవారు. మంచి, మన్నన తెలిసినవారు. పెద్ద ఆఫీసర్ల భార్యలు, వయస్సులో పెద్దవారు. లేడీస్ క్లబ్బుకి పెద్దలు... వారు ...వారు... తనని గూర్చి చేసిన విమర్శ ఏమిటి... వారి దృష్టిలో తన విలువే మిటి... వారి కంఠంలో చీత్కారమేమిటి...

నిషాంత్‌కి తనకి అక్రమసంబంధమా!

తన వయస్సెంత?

అతని వయస్సెంత? తనకి ముప్పై అయిదు. అతనికి ముప్పై సంవత్సరాలు. పై పెచ్చు అతను తన చెల్లెలు ప్రభ భర్త... ముగ్గురు బిడ్డల తండ్రి... పదేండ్లు కాపరం చేసి తన గుర్తుగా తన భర్త తనకి జస్వంత్‌ని మిగిల్చిపోయి కూడా రెండేండ్లయితే... తనకింకా శరీ రంలోని ఉప్పుకారాల పస తగ్గలేదట... ఎంత అసహ్యకర మయిన అభియోగం వారిది!

విద్యకి ఆస్తి! అంతస్థు! పేరు గడించిన డాక్టరుగా హోదా! లవుక్లోకల్లా ప్రసిద్ధిగాంచిన విద్యా నర్సింగ్ హోమ్‌తోపాటు, వయస్సు మీరుతున్నా తరగని అందం. హుందాతనం... ఇలా ఎన్నో క్వాలిఫికేషన్లున్నాయి. వున్నంత మాత్రాన మరో మగవాడితో జోడీ కల పాల్నా...

విద్య మనస్సెందుకో ఈ మధ్య అస్సలు బాగుండ డంలేదు.

కారు పార్కుచేసి ఇంట్లోకెళ్ళగానే అమ్మ-

"చిన్నాడి దగ్గర నుంచి ఉత్తరమొచ్చింది విద్యా! వాడి కూతురు రజస్వల అయిందట. నన్నొకసారి వచ్చి వెళ్ళమన్నాడు... మరి వెళ్ళేటప్పుడు వట్టిచేతులతో ఎలా వెళ్ళేది? నాకు చిట్టచివరి మనుమరాలాయె. ఓ ఐదు సవర్లకి వంకీలు, పట్టుచీరన్నా ఇవ్వాలి కదా..."

అంటే కనీసం పదివేలయినా కావాలి.

జవాబేం చెప్పకుండా గదిలోకెళ్ళి తలుపేసుకొంది విద్య.

ఆలోచనలకి భంగం కలిగిస్తూ ఫోను. అన్నయ్య దగ్గర నుంచి- "హల్లో... విద్యా... బాబుకి ఇంజనీరింగులో సీటొచ్చింది. వారం రోజులలో ఫీజు గట్రా కట్టాలి. ఓ ఐదువేలుంటే సర్దమ్మా... మరల త్వరలో ఇచ్చేస్తాను..."

ఆఖరిమాట మాత్రం అబద్ధం.

రెండో అన్నయ్య నాల్గు రోజుల క్రితమే వార్త పంపాడుగా కూతురికి నిశ్చితార్థమని... అంటే ... భర్త పోయినంతమాత్రాన డబ్బుతో తనకి పనిలేదా... మరెందుకు తాను కష్టపడి సంపాదించడం...

పెద్దన్న ఇంజనీరు.

రెండో అన్న పెద్ద కంట్రాక్టరు.

తమ్ముడు డాక్టరు.

వీరందరూ కలసి ఓ ఎత్తు. అమ్మ ఒక్కటీ ఒక ఎత్తు. ఎంతసేపటికీ మంచి పరిస్థితులలో వున్న కొడుకు లకి తనదంతా దోచిపెట్టాలంటుందేమిటి!?!...

డాక్టరు విద్యకి తల్లి,తండ్రి, తోబుట్టువులు... అందరూ వున్నా జీవితంలో ఎవరూ భర్తీ చేయలేని లోటు... ఏదో నిర్లిప్తత... ఎంతకీ త్వరగా కరగని కాలం... కదలని జీవితం...

* * *

నిషాంత్ మంచి వ్యక్తి. ఏ విషయంలో ఎప్పుడూ డాక్టరు విద్య నుంచి ఎలాంటి సహాయాన్నీ వాంఛించని వాడు. గౌరవాన్ని, అభిమానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం తెలిసినవాడు. గొప్పకుటుంబంలో మంచి పుట్టుకపుట్టి వ్యాపారాలలో సర్వం పోగొట్టుకున్నా... వున్నంతలోనే బ్రతకడం నేర్చుకున్నవాడు.

'నా జీవితానికి రక్షణ కల్పిస్తావా... నేను కష్టపడి సంపాదించే డబ్బు నా బిడ్డకందేవరకు... నాకాశ్రయం కల్పించగలవా... సమాజం వేలెత్తి చూపని విధంగా- నన్ను వివాహం చేసుకొని భర్తగా బాధ్యత నెత్తినవేసుకోగలవా?..."

డాక్టర్ విద్య ఇలా అడిగినప్పుడు వయసులో చిన్న వాడయినా పెద్ద మనస్సుతో చేయి అందించాడు నిషాంత్.

విద్య చెల్లెలు ప్రభ కూడా మనస్ఫూర్తిగా అంగీకరిం చింది.

డబ్బుపై ఆశలేని వ్యక్తికి ఆపేక్ష విలువ తెలుస్తుంది.

ధనమంటే వ్యామోహంలేని మనిషికి అనురాగానికి అర్థం స్ఫురిస్తుంది- ఇవి డాక్టరు విద్య నమ్మకాలు. అవి వమ్ముకాలేదు.

ఇప్పుడెవరు విమర్శిస్తారు విద్యను గూర్చి?

బంధువులందరు... చివరికి తల్లిదండ్రులు కూడా పగబూనినా విద్య ధైర్యాన్ని విడనాడలేదు. నిర్ణయాన్ని మార్చుకోలేదు.

డాక్టర్ విద్య నిన్నటి మహిళా? కాదు.

నేటి మహిళా? కానేకాదు.

ఆమె రేపటి మహిళ! మహోజ్వల శక్తి!

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీకథ వివరాలు దిగువ యిచ్చిన కూపన్‌లో నింపి, పోస్టుకార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

—ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన మినీకథ..........................................

రచయిత/రచయిత్రి..........................................

పేజీ నంబరు: ___ ___ ___ ___